ఓటు నమోదుకు మరో చాన్స్!

- ఈ నెలాఖరు వరకు అవకాశం
- నవంబర్ 15న తుది జాబితా ప్రకటన
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు



ఓటరు జాబితాలో పేరును చూసుకుంటున్న ఓటరు

చాదర్‌ఘాట్: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 31వ తేదీ వరకు కొత్తగా ఓటు నమోదు చేసుకొనేందుకు అధికారులు మరో అవకాశం కల్పించారు. అలాగే, ఇప్పటికే ఓటు నమోదు చేసుకున్న వారు తమ ఓటును బదిలీ చేసుకునేందుకు కూడా వెసులుబాటు కల్పించారు. కొత్తగా ఓటు నమోదు చేసుకుంటే నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు అవకాశం దక్కనుంది. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకునేందుకు మరోసారి అవకాశం ఇచ్చిన నేపథ్యంలో జాబితాలో పేరు లేని వారంతా ముందుకు వచ్చి ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎన్నికల అధికారులు కోరుతున్నారు. ఇలా ఉండగా, క్షేత్రస్థాయి సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాలో పేర్లు ఉన్నాయా? లేదా అనేది పరిశీలిస్తున్నారు. ఎవరికైనా ఓటు లేకపోతే వెంటనే ఫారం -6 ఇచ్చి కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేయిస్తున్నారు.

నమోదుకు ఫారం-6, బదిలీకి ఫారం-8

ముసాయిదా జాబితాతో పోలిస్తే తుదిజాబితాలో ఓటర్లు పెరిగినా, పోలింగ్ తేదీ నాటికి 18ఏళ్లు దాటిన వారందరికీ మరో అవకాశం కల్పించాలని నిర్ణయించారు. ఈనెల 31 వరకు బీఎల్‌ఓలు సహాయ రిటర్నింగ్ అధికారుల ద్వారా ఫారం-6 పొంది కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించారు.

ఓటు తొలగిస్తే ఏం చేయాలి ?

30 ఏళ్లు ఉన్నవారు గతంలో ఏదైనా నియోజకవర్గంలో ఓటరుగా నమోదై ఉంటారు. ఇలాంటి వారిలో కొందరు ప్రస్తుతం మరో నియోజకవర్గంలో నివసిస్తుంటారు. వారు గతంలో ఓటు వేసిన నియోజకవర్గంలో ఓటు తొలగించి ఉంటే తమ ఓటరు గుర్తింపు కార్డు చూపించి ప్రస్తుతం నివాసం ఉంటున్న నియోజకవర్గంలో ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఇందుకు ఫారం-8లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు.

నియోజకవర్గంలో ప్రస్తుత ఓటర్లు...

ఈనెల 4న ఎన్నిక సంఘం విడుదల చేసిన ఓటర్ల జాబితా ప్రకారం మలక్‌పేట నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య 311824. ఇందులో పురుషులు 158006, మహిళలు 153805, థర్డ్‌జెండర్లు 13 మంది ఉన్నారని ఎన్నికల అధికారులు తెలిపారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ 29వ డివిజన్‌కు చెందిన బీజేపీకి కార్యకర్తలు మాజీ ఎంపీటీసీ శ్రీను నాయక్ ఆధ్వర్యంలో గురువారం మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం శ్రీనునాయక్ మాట్లాడుతూ.. కోట్ల రూపాయల నిధులతో మంత్రి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని, నియోజకవర్గ అభివృద్ధి సబితా ఇంద్రారెడ్డితోనే సాధ్యమన్నారు. అభివృద్ధిని కోరుకునే వారంతా రానున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మీర్‌పేట కార్పొరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేష్‌గౌడ్, కార్పొరేటర్ నర్సింహ, యువజన విభాగం అధ్యక్షుడు నాగరాజు, నాయకులు శ్రీరాం, రాజు, సాలయ్య, సత్తయ్య తదితరులు ఉన్నారు.



మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

ఎల్బీనగర్‌ను మరింత అభివృద్ధి చేస్తా..

ఎల్‌బీనగర్: అభివృద్ధి విషయంలో ఎల్‌బీనగర్ నియోజకవర్గం ఎంతో ప్రగతి సాధించిందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఎస్సీ ఉపకులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. అనంతర పలువురు ఎస్సీ ఉపకులాల నాయకులు మాట్లాడుతూ, త్వరలో జరిగే ఎన్నికల్లో సుధీర్‌రెడ్డిని భారీ మోజార్టీతో గెలిపిస్తామన్నారు. సమావేశంలో ఎస్సీ ఉపకులాల సమన్వయ కమిటీ నాయకులు చిరంజీవి, రమేష్, జోగురాములు, యాదగిరి, శివశంకర్, రాజేందర్, హరిబాబు, బాలాజీ, గైక్వాడ్, బాలసుందరి, ప్రమీల, అనిత,శ్రీధర్, సరోజ, నిర్మల, పద్మ పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

చార్మినార్: ఎన్నికల నియమావళిని తూచా తప్పకుండా పాటించాల్సిన అవసరం ఉందని చార్మినార్ శాసనసభ నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి,జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న అన్నారు. గురువారం మొఘల్‌పురా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని రిటర్నింగ్ కార్యాలయంలో సహాయ రిటర్నింగ్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఏ అధికారి పని చేయరాదన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తమ విధినిర్వహణ కొనసాగించాలన్నారు. సహాయ రిటర్నింగ్ అధికారులు డీడీ నాయక్, చాముండేశ్వరి, అబ్దుల్ ఖాదర్, నిహారిక తదితరులున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



కాలనీలో ప్రతినిధులతో కలిసి పర్యటిస్తున్న బొమ్మిడి రంగారెడ్డి

హస్తినాపురం: కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానని రంగారెడ్డి నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొమ్మిడి రంగారెడ్డి అన్నారు. గురువారం కాలనీ ప్రతినిధులతో కలిసి కాలనీలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బొమ్మిడి రంగారెడ్డి మాట్లాడుతూ, కాలనీలో కనీస వసతుల ఏర్పాటు కోసం అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామని, సమస్యల పరిష్కారం కోసం స్థానిక శాసన సభ్యుడు సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

క్లుప్తంగా

రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమోటా 17, వంకాయ 23, బెండ 23, పచ్చిమిర్చి 40, కాకర 23, బీర 18, క్యాబేజీ 18, ఫ్రెంచిబీన్స్ 65, క్యారెట్ 40, దొండ 13, చిక్కుడు 35-45, గోకర 35, బీట్‌రూట్ 25, క్యాప్సికం 45, ఆలు 21, దోస 13, సొర 9, పొట్ల 13, ఉల్లిగడ్డ 40, చామగడ్డ 40. శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

28న తారామతి బారాదరిలో నాట్య తోరణం

గోల్కొండ: గోల్కొండ తారామతి-బారాదరిలో ఈనెల 28న నాట్య తోరణం నిర్వహిస్తామని అమృత కల్చరల్ ట్రస్ట్ మెనేజింగ్ ట్రస్టీ భార్గవి పగడాల తెలిపారు. హైదరాబాద్ క్లాసికల్ డ్యాన్స్ ఫెస్టివల్ పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కూచిపూడి, భరతనాట్యం, మోహినీ అట్టం, ఒడిస్సీ, కథక్‌లతో పాటు నాట్య గురువు కళా కృష్ణ బృందం పేరిణి శివతాండవం కార్యక్రమం ఉంటుందని ఆమె తెలిపారు. ఈ నాట్య ప్రదర్శనకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామన్నారు. నాట్యరంగంలో ఉత్సాహవంతులైన యువతను గుర్తించి వారిని ప్రోత్సహిస్తున్నామన్నా రు. తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్, డీఐజీ సుమతి తదితరులు పాల్గొంటారని ఆమె వివరించారు.

నేడు ఈఎంటీ ఉద్యోగానికి ఇంటర్వ్యూలు

గౌలిపురా: ఈఎంఆర్ఐ (108) సంస్థలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ) ఉద్యోగానికి ఈనెల 27న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ప్రోగ్రామ్ మేనేజర్ జాన్‌షాహీద్‌షేక్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ సెట్‌ను తీసుకుని హాజరు కావాలని సూచించారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌కు జీఎన్ఎం, ఏఎన్ఎం, డీఎంఎల్‌టీ, ఎంఎల్‌టీ, బీఎస్సీ (బీజెడ్సీ) అర్హతలు కలిగి ఉండి 30 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. కింగ్‌కోఠిలోని 108 రీజినల్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 9000001674.

వైద్య విద్యార్థి చదువుకు ఆర్థిక సాయం

దిల్‌సుఖ్‌నగర్: మహబూబ్ నగర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించిన అనాథ విద్యార్థి రమావత్ హనుము ఎంబీబీఎస్ కోర్సు పూర్తి చేసేందుకు అవసరమైన మొత్తం డబ్బును తాము సమకూరుస్తానని ఎన్ఆర్ఐ చింతల రజినీకాంత్ హామీ ఇచ్చారని అనాథ విద్యార్థి గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్ తెలిపారు. హనుము మొదటి సంవత్సరం అడ్మిషన్, హాస్టల్ ఫీజుల కోసం ఆయన రూ.75 వేల ఆర్థిక సాయం పంపించారన్నారు. సరూర్‌నగర్‌కు చెందిన చింతల రజినీకాంత్ ప్రస్తుతం అమెరికాలో ఉంటున్నారని తెలిపారు.

హెచ్‌సీఏ అధ్యక్షుడికి ఘన సత్కారం



అర్శనపల్లి జగన్‌మోహన్‌రావును సత్కరిస్తున్న నర్సింహారావు

హస్తినాపురం: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన అర్శనపల్లి జగన్‌మోహన్‌రావును అసోసియేషన్ కార్యాలయంలో గురువారం రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ యువజన విభాగం మాజీ అధ్యక్షుడు మాధవరం నర్సింహారావు పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో పాశం శ్రీధర్, వెంకట్‌రెడ్డి, నాగార్జునగౌడ్, శ్రీకాంత్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'పరంపర' నాటక ప్రదర్శన

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నాటకరంగ సంస్థ రసరంజని ఆధ్వర్యంలో శ్రీకృష్ణ తెలుగు థియేటర్ ఆర్ట్స్ పర్యవేక్షణలో 'పరంపర' అనే నాటకాన్ని గురువారం రవీంద్రభారతిలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ.రమణాచారి మాట్లాడుతూ.. నాటి స్థితిగతులు నేటితరం ఆలోచన స్థితులను నాటకరూపంలో అద్భుతంగా ప్రదర్శించారని కొనియాడారు. రంగస్థల నటులు సుబ్బరాయశర్మ, రసరంజని కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



నాటకంలోని ఓ దృశ్యం

ఉత్సవాలు ఐక్యతను నింపుతాయి



పెద్దతోట ఆలయంలో అన్నదానం చేసిన ఆలయ చైర్మన్ కాశీవాల అశోక్

సైదాబాద్: సాంప్రదాయబద్ధంగా నిర్వహించే ఉత్సవాలు అందరిలో ఐకమత్యాన్ని నింపుతాయని వాగ్దాని దుర్గామాత ఆలయ కమిటీ చైర్మన్ కాశీవాల అశోక్ అన్నారు. ఐఎస్‌సదన్ డివిజన్ పరిధి పెద్దతోటలోని అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన మండపంలో తొమ్మిది రోజుల పాటు శాస్త్రోక్తంగా నిర్వహించిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ, కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారంగా పెద్దతోటలో కొలువైన వాగ్దాని దుర్గామాత ఆలయంలో 40 సంవత్సరాలుగా నవరాత్రి వేడుకలను సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నామన్నారు. నవరాత్రి ముగింపు వేడుకల సందర్భంగా ఆయన భక్తులతో కలిపి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. యువకులు, చిన్నారుల ఆటపాటలతో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు.

మహిళా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

కాచిగూడ: మహిళల కోసం ప్రత్యేకంగా మహిళా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని స్త్రీ హస్తిన మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ ఎర్రం పూర్ణ శాంతి గుప్తా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్త్రీ హస్తిన మహిళా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా మహిళా సమ్మేళనం అలయి.. బలయి.. కార్యక్రమంలో ఆమె పాల్గొని వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులను సత్కరించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆమె పిలుపునిచ్చారు.

మాధవపెద్ది సత్యం స్వరం విలక్షణం

చిక్కడపల్లి: మాధవపెద్ది సత్యం స్వరం విలక్షణం, వైవిధ్యంతో కూడి ఉంటుందని రిటైర్డ్ డీజీపీ డాక్టర్ సి.ఎన్.గోపీనాథ్‌రెడ్డి అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయగానసభలో గురువారం రాత్రి శ్రీ భారతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో తెలుగు సినీ నేపథ్య గాయకుడు మాధవపెద్ది సత్యం శత జయంతి వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా గోపీనాథరెడ్డి పాల్గొని సుస్వర భారతి పురస్కారాలను ఆమని, రావూరి మాధవి జ్యోర్మయి బొమ్మలకు ప్రదానం చేశారు. శ్రీ భారతి మాధవపెద్ది శతజయంతి పురస్కారాలను నటి నర్తికి సబితకు మాధపపెద్ది కుమార్తె నాగలక్ష్మికి పాడుతా తీయాగా పేమ్ ప్రవీణ్‌కుమార్‌కు ప్రదానం చేశారు.

ఇంద్రసేనారెడ్డి ప్రమాణ స్వీకారానికి తరలిన బీజేపీ నేతలు



గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన ఇంద్రసేనారెడ్డిని సన్మానిస్తున్న రమేష్‌రెడ్డి



శుభాకాంక్షలు తెలిపిన వెంకటేశ్వర్ రెడ్డి



అభినందిస్తున్న సిద్ధాల ఐలయ్య

మలక్‌పేట: త్రిపుర గవర్నర్‌గా నల్లు ఇంద్రసేనారెడ్డి గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు మలక్‌పేట, ఎల్బీనగర్ నియోజకవర్గాల నుంచి పలువురు బీజేపీ నేతలు అగర్తలా వెళ్లారు. మలక్‌పేట నుంచి భాగ్యనగర్ జిల్లా ప్రధానకార్యదర్శి సండడి సురేందర్‌రెడ్డి, కోశాధికారి తుమ్మలపల్లి రమేష్‌రెడ్డి, సీనియర్ నేతలు బి.నర్సింహ, బొక్క మధుసూదన్‌రెడ్డి, మూసారంబాగ్ అధ్యక్షుడు కొప్పుల దినేష్, వనస్థలిపురం డివిజన్ బీజేపీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, నాగోలు డివిజన్‌కు చెందిన సీనియర్ నేత సిద్ధాల ఐలయ్య వెళ్లారు. ప్రమాణ స్వీకారం అనంతరం రాజ్‌భవన్‌లో ఇంద్రసేనారెడ్డిని కలిసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

సబితారెడ్డితోనే అభివృద్ధి సాధ్యం

- బీఆర్ఎస్ నాయకుడు కొండల్‌రెడ్డి

హుడాకాంప్లెక్స్: మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధి మంత్రి సబితా ఇంద్రారెడ్డితోనే సాధ్యమని బీఆర్ఎస్ నాయకులు లోకసాని కొండల్‌రెడ్డి అన్నారు. గురువారం సరూర్‌నగర్ డివిజన్ వెంకటేశ్వస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సబితా గెలుపుపై గడపగడపకూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అండగా నిలబడదామని, మంత్రి సబితారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుని నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. పనిచేసే ప్రభుత్వానికి అండగా నిలబడదామని పిలుపునిచ్చారు.



యువత సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న టీఎఫ్‌సీఓ చైర్మన్ మహ్మద్ నజీబ్, ఖాలీద్‌అలీఖాన్

గోల్కొండ: సమాజ సేవా కార్యక్రమాల్లో యువత పెద్దఎత్తున పాల్గొనాలని దీన్ని వల్ల వారిలో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం గోల్కొండ జీఎంకే ప్రైమ్ గార్డెన్‌లో తెలంగాణ ఫ్యామిలీ కౌన్సిలింగ్ ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మన్ మహ్మద్ నజీబ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేతో పాటు మజ్లిస్ ఏరియా కమిటీ అధ్యక్షులను సన్మానించారు. ఈ సందర్భంగా మహ్మద్ నజీబ్ గత 13 ఏళ్లుగా తమ ఆర్గనైజేషన్ చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన విజయాలను ఆయనకు వివరించారు. వందలాది కూలే కాపురాలను కౌన్సిలింగ్ ద్వారా తాము నిలబెట్టామన్నారు. కుటుంబ కలహాలతో తమ దగ్గరకు వచ్చిన వారిని పలుమార్లు కౌన్సిలింగ్ నిర్వహించి వారు కలిసిమెలిసి ఉండేలా చూశామన్నారు. ప్రతిభ ఉండి చదువులకు నోచుకోని నిరుపేదలు ఎందరో ఉన్నారని ఇటువంటి వారికి సరైన మార్గదర్శనం చేయాలని ఆయన యువతకు పిలుపునిచ్చారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించే వారికి తన మద్దతు ఎప్పుడు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా టిఎఫ్‌సిఓ ఎమ్మెల్యేను సన్మానించి మెమొంటో అందజేశారు. కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ పార్టీ కమిటీ ప్రతినిధులకు మెమొంటోలను అందజేశారు. టీఎఫ్‌సిఓ ప్రతినిధి ఖాలీద్ అలీఖాన్, పాషాభాయ్, షకీల్ అలీఖాన్, ఆరూస్‌ఫరాన్, బదరుద్దీన్ తదితరులున్నారు.

31న 'నేను నా రచనలు'

సుల్తాన్‌బజార్: 'నేను నా రచనలు' అనే కొత్త కార్యక్రమాన్ని తెలంగాణ సారస్వత పరిషత్ ప్రారంభించనున్నట్లు పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రఖ్యాత కవి రచయితలు, పరిశోధకులు, విమర్శకుల స్వీయజీవిత, సాహిత్య విశేషాలను పాఠకులతో పంచుకునే ప్రసంగ పరంపర అనే కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ నెల 31న సాయంత్రం 5.30 గంటలకు పరిషత్ అధ్యక్షులు ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత సలీం మొదటి వక్తగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వివరించారు.

పార్టీల మేనిఫెస్టోల్లో పిల్లల సంక్షేమానికి హామీలేవి?

- బాలల హక్కుల సంఘం అధ్యక్షురాలు అనురాధరావు

రామంతాపూర్: రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రధాన పార్టీలు ప్రకటించిన తమ ఎన్నికల మేనిఫెస్టోలను విడుదల చేశాయి. అన్ని పార్టీలు అన్ని వర్గాలకు అన్ని రకాల హామీలను చేర్చారు. కానీ పిల్లల హక్కులు, వారి సంక్షేమానికి పార్టీ ఏమి చేస్తుందని మేనిఫెస్టోలో చేర్చడం మరిచిపోయాయని గురువారం విడుదల చేసిన ప్రకటనలో బాలల హక్కుల సంఘం అధ్యక్షురాలు అనురాధ రావు పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఓటర్లుగా మారే పిల్లల సంక్షేమం వారి హక్కుల పరిరక్షణకు చేపట్టాల్సిన వాటిని మేనిఫెస్టోలో చేర్చకపోవడం బాధాకరమన్నారు. ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల నియంత్రణ, ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు, విద్యార్థులను వేధిస్తే తీసుకోవాల్సిన చర్యల గురించి కూడా పార్టీల మేనిఫెస్టోలో చేర్చాలని ఆమె డిమాండ్ చేశారు.

సంక్షేమ పథకాలపై ఫిర్యాదు అవివేకం: బీఆర్ఎస్



వనస్థలిపురం పనామా చౌరస్తాలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

వనస్థలిపురం: తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఎన్నికల నేపథ్యంలో నిలిపి వేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేయడంపై బీఆర్ఎస్ నాయకులు భగ్గుమన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో గురువారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేసి ధర్నా, రాస్తారోకో నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల అమలును అడ్డుకోవాలని చూడటం అవివేక చర్య అని, రానున్న ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు తగిన బుద్ధిచెప్తారని, మళ్లీ బీఆర్ఎస్‌నే ఆశీర్వదిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

- బీఆర్ఎస్ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్ ఆధ్వర్యంలో, మన్సూరాబాద్ చౌరస్తాలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో, హయత్‌నగర్‌లో డివిజన్ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. హస్తినాపురంలో డివిజన్ అధ్యక్షుడు ఆందోజు సత్యంచారి ఆధ్వర్యంలో, కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌లో మాజీ కార్పొరేటర్ జీవీ సాగర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు లింగాల రాహుల్‌గౌడ్ ఆధ్వర్యంలో, నాగోలు చౌరస్తాలో డివిజన్ అధ్యక్షుడు చిరంజీవి, ఉపాధ్యక్షుడు గవ్వ శ్యామ్ సుందర్ రెడ్డి ఆధ్వర్యంలో, చంపాపేట డివిజన్ కర్మన్ ఘాట్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు నల్లా రఘుమారెడ్డి, సుంకోజు కృష్ణమాచారి. అధ్యక్షుడు ముడుపు రాజ్‌కుమార్ రెడ్డి నిరసన వ్యక్తం చేశారు.


వైద్యులు సమయపాలన పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రాజశ్రీ

చార్మినార్: విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే.. శాఖాపరమైన చర్యలు తప్పవని చార్మినార్ జోన్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రాజశ్రీ హెచ్చరించారు. గురువారం జోన్ పరిధిలోని బస్తీ దవాఖానాలకు చెందిన వైద్యులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోజూ తప్పనిసరిగా సమయానికి ఆయా బస్తీ దవాఖానాలలో సంబంధిత వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. సమయానికి రావడమే కాకుండా రోజూ 5 మందికి టెలి మెడిసిన్స్ కాల్స్ చేయడం, దవాఖానాలలో సరిపడా మందులను అందుబాటులో ఉంచుకుని అవసరమైన ప్రతి రోగికి మందులను అందజేయాలన్నారు. మహిళలకు ఇతరాత్ర ఆరోగ్య సమస్యలున్నట్లు తెలిస్తే.. వెంటనే వారిని దగ్గరలోని యూపీహెచ్‌సీలకు రిఫర్ చేయాలన్నారు. యూపీహెచ్‌సీలలో 70 శాతం డెలివరీలను నార్మల్‌గా జరిగేటట్లు చూడాలన్నారు. డాక్టర్ సునంద, డాక్టర్ బ్రిడ్జిస్, డాక్టర్ మల్లీశ్వరి, డాక్టర్ రఫీక్ తదితరులున్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో స్వర్ణం



గన్‌ఫౌండ్రీ: హైదరాబాద్ పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన బెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్ పోటీలలో నగరానికి చెందిన తేజావత్ సుకన్యభాయి స్వర్ణ పతకం సాధించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఐఏఎస్ అధికారి తేజావత్ రాంచంద్రుడు, ఏస్ ఇంజినీరింగ్ అకాడమీ ఎండీ వైవీ.గోపాలకృష్ణమూర్తిలు ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నవంబర్‌లో జరిగేటటువంటి జాతీయస్థాయి పోటీలలో గెలుపొంది రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. దీనికి ఆమెకు కావాల్సిన సహాయ సహకారాలను అందిస్తామని ఏస్ ఇంజినీరింగ్ అకాడమీ సీఎండీ గోపాలకృష్ణమూర్తి తెలిపారు. 76 కిలోల విభాగం, 140 కేజీల విభాగంలో రెండు స్వర్ణ పతకాలను సాధించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

రైతులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

సుల్తాన్‌బజార్: ఇందనల్ కంపెనీ వద్ద రైతులపై పోలీసుల దమనఖాండను పౌరహక్కుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు గురువారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ఎస్.నారాయణరావులు మాట్లాడుతూ.. అక్టోబర్ 22న ఎక్లాస్‌పూర్ చిత్తనూర్, జిన్నారం గ్రామ ప్రజలు శాంతియుతంగా చేస్తున్న ధర్నాపై పోలీసులు దాడి చేశారని, ప్రజాస్వామ్యబద్ధంగా చేస్తున్న ధర్నాపై పోలీసుల చర్యలు సరికాదన్నారు. కంపెనీ నుంచి విడుదలవుతున్న వ్యర్థాలను నిల్వ చేయడానికి సరైన స్థలం కూడా లేదన్నారు. ఇటీవల కంపెనీ వారు పక్కనే ఉన్న మన్నెవాగులోకి విష రసాయన పదార్థాలను వదిలారని, ఆ ప్రభావంతోనే చేపలు, జింకలు, ఇతర వన్యప్రాణులు మృతిచెందాయని ఆవేదన వ్యక్తం చేశారు. చిత్తనూరు ఇందనల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 21 నారాయణపేట జిల్లా కలెక్టర్‌కు పరిస్థితిని రైతులు వివరించారన్నారు. ఈ విషయమై ఎమ్మార్వో పరిశీలించేందుకు రావడంతో పరిష్కరించే దిశగా దిశగా ట్యాంకర్‌ను చెక్ చేయాలని ఆదేశించారు. 22న ధర్నా చేస్తున్న వారిపై పోలీసులు లాఠీ ఛార్జీ చేసి రెండు ద్విచక్ర వాహనాలను దహనం చేశారన్నారు.

ఈ ఘటనపై ప్రభుత్వ సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లాఠీఛార్జీలో గాయపడిన గ్రామస్తులకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కంపెనీని మూయించాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.